# BOOK - III
# ప్రేమ కథలు

ఆత్మకథ :

## తల్లి సాలు పిల్లడు

నేను జగిత్యాల పట్టణంలో స్వాతంత్ర్యానంతరం పుట్టాను. పంతొమ్మిది వందల నలభయి తొమ్మిదిలో దీపావళినాడు పుట్టానని అమ్మ చెప్పేది. పాఠశాల రికార్డులో ఆగస్టు యిరవై మూడు అని నమోదైంది. ఆ కాలంలో కేవలం రెండు నెలల తేడాతో నమోదు కావడం గొప్పే. ఈ గొప్పతనం స్కూల్లో చేర్పించిన మా తాతకు, చేర్చుకున్న ఉపాధ్యాయులకు దక్కుతుంది.

నేను అమావాస్యనాడు దీపావళి పండుగ రోజు పుట్టాను. అమావాస్యనాడు ఆడపిల్ల పుడ్తే అదృష్టవంతురాలని - పున్నమినాడు మగపిల్లలు పుడ్తే గొప్పవాళ్ళవుతారని విశ్వసించేవారు. అమావాస్యనాడు అమ్మ ప్రసూతి నొప్పులు పడుతుంటే ఆడపిల్లే పుట్టాలని ఎదురు చూస్తుంటే నేను పుట్టాను. నా పుట్టుకకు అందరూ ముక్కులు చీదుకున్నారు. కళ్ళు ఒత్తుకున్నారు. నా పుట్టుక యిరుగు పొరుగునూ కలచివేసింది.

అమావాస్యనాడు పుట్టిన మగపిల్లడు దరిద్రుడు, నష్టజాతకుడు, వీడి ముఖం చూస్తే జేష్ఠ అంటూ ముఖం చిట్లించేవారు. అనాదరంతో ఈసడించేవారు. నా ప్రతి కదలికను అమావాస్యకు ముడేసి నీచంగా వ్యాఖ్యానించేవారు. నాకది భరించలేని బాధ కల్గించేది. అమావాస్యనాడు మగపిల్లాడు పుట్టకూడదు అని నిర్ణయించిన వాడెవడోగాని వాన్ని తన్నాలని నా చిన్ని కడుపులో చెప్పలేని ద్వేషం రగిలింది.

అమ్మతో, యింటిల్లిపాదితో నన్ను నేను సమర్థించుకోవడం ప్రారంభించాను. నన్నలా కించపరచవద్దని ఏడ్చేసేవాణ్ణి. నా ముద్దు చేష్టల్ని మురిపెంగా చూసేవాళ్ళు. అయినా వారికి కోపం వచ్చే పనులు చేసినపుడు మళ్ళీ అమావాస్యపుటకను గుర్తు చేసి కించపరిచేవాళ్ళు.

ఇలా చిన్నప్పటినుంచే పెద్దల్ని ఎదిరించటం నా జీవితావసరాల్లో భాగంగా మొదలైంది. పెద్దలకు, వారి సంప్రదాయ విశ్వాసాలకు వ్యతిరేకంగా జీవితంలో చేసిన మొదటి పోరాటం యిది. ఈ అవసరం చేత చిన్ననాటి నుండే వాదనాపటిమ అబ్బింది. వాదనతో పాటు వాళ్ళు ప్రేమించే విధంగా నన్ను నేను మలుచుకున్నాను. వారి విశ్వాసాలపై విజయం సాధించాను. ఈ క్రమం ఆత్మవిశ్వాసాన్ని పెంచి వ్యక్తిత్వాన్ని స్వీయ విశ్వాసాల మీద రూపొందించుకోవడానికి పునాది వేసింది.

అతి చిన్న వయసులో నాకు పోషమ్మతల్లి(మశూచి) అయింది. ఆ రోజుల్లో మశూచితో ఎందరో చనిపోయారు. నాకు యిచ్చి పెళ్ళి చేద్దాం అనుకున్న మేనమామ కూతురు మశూచితోనే చనిపోయింది. అమావాస్యనాడు పుట్టాను కదా పీడా పోతే బావుండుననుకున్నారు. అమ్మ నిరాశ చేసికొంది. నేను బతికాను, శరీరంపై మిగిలిన తీవ్రమైన మశూచి మచ్చలు తక్కువే.

మేం అమ్మను అవ్వా అని, నాన్నని నాయిన్నా అని, పిన్నిని చిన్నీ అని, అమ్మమ్మను ముసలవ్వా అని పిలిచేవాళ్ళం. మా నాన్న పేరు మిట్టపెల్లి నారాయణ. అమ్మపేరు బేతి లక్ష్మిరాజు. ఇద్దరూ పద్మశాలి కులంలో పుట్టారు. బట్టలు నేయడం మా కులవృత్తి. నాన్న స్వంత ఊరు కోరుట్ల. అల్లిపురం నుండి నానమ్మ తాత పిల్లల్ని తీసుకుని కోరుట్ల వలస వెళ్ళారు. ఆ రోజుల్లో భయంకరమైన ప్లేగుతో ఎందరో చనిపోయారు. బతుకు భయంతో కొందరు వలసపోయారు. అందులో మా తాత కుటుంబం ఒకటి.

నానమ్మకు నాన్న మూడో సంతానం-చివరి సంతానం. నానమ్మ తమ్ముడు బేతిరాజయ్య కానుపు కోసం ఎనిమిదేళ్ళు ఎదురుచూసి మేనల్లుడైన నాన్నను పెంపకం తీసుకున్నాడు. తనకు సంతానం గనక అయితే పెద్దకొడుకుగా సర్వహక్కుల్తో ఉంచుకోవడానికి ఒప్పందాలు "రాసు కున్నారు." అంటే మా యిళ్ళల్లో "రాతపూతలు" డెబ్బయి ఏళ్ల ముందునుండే ఉన్నాయి.

నాన్న పెంపకం వచ్చాక బుచ్చిరాజు అమ్మమ్మలో మాతృత్వం పొంగి ప్రవహించిందేమో, కొన్నాళ్ళకు మా మేనమామను, తర్వాత అమ్మను, ఆ తర్వాత పిన్నిని కన్నది. కుటుంబ నియంత్రణ లేకుండానే సంతానం ముగ్గురితో ఆగిపోయింది.

ముందు అనుకున్నట్టుగానే నాన్నకు ఆ యింట్లో పెద్దకొడుకు హోదా లభించింది. ఈడూ జోడూ సరిపోవడంతో అమ్మనిచ్చి పెళ్ళి చేశారు. నాన్న ఆ యింట్లో యిల్లరికం అల్లుడు కాదు-నాన్న ఒకే సమయంలో ఆ యింటికి పెద్దకొడుకూ - పెద్దల్లుడూ.

పెద్దకొడుకు స్థానం వల్ల తర్వాత కొంత నష్టం జరిగింది. పెద్దవాళ్ళు పడమరవైపు ఉండాలనే వారి సంప్రదాయం వల్ల నాన్నకు తాత కట్టిన పాతయిల్లు వచ్చింది. ఉమ్మడి కుటుంబంలో భాగంగా నాన్న కట్టిన కొత్తయిల్లు మేనమామకు పోయింది.

నాన్నవాళ్ళు ముగ్గురన్నదమ్ములు. పెదనాన్న "అల్లిపురం రాజాలు"-అసలు పేరు మిట్టపెల్లి రాజయ్య. ఆయన చిన్నప్పుడు బట్టలు నేసేవాడు. కొంత చదువుకున్నాడు. తర్వాత "అచల గురువు' 'గా ఎదిగాడు. అరవై ఏళ్ళు అచలతత్వ గురువుగా మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్ర రాష్ట్రాల్లో వేలాది శిష్యులతో ప్రబోధాలు సాగించాడు. సాత్వికుడు, శాఖాహారి. తన శిష్యుల్లో కొందరికి దీక్ష యిచ్చి గురువులుగా మార్చాడు. అచల బోధనల్ని గీతాలుగా సంపుటాలు ప్రచురించాడు.

ఆయన తన ఎనభై అయిదో ఏట చనిపోయి ఎనిమిదేళ్ళయింది. కోరుట్లలో ఆయనకు సమాధి-గుడి కట్టారు శిష్యులు. దాన్నొక పవిత్ర స్థలంగా అభివృద్ధి పరుస్తున్నారు. ఆయన చనిపోయిన రాఖీ పౌర్ణమి మూడో రోజున అక్కడ ఏటా భజనలు, తత్వచర్చలు, సమారాధనోత్సవాలు, అన్న సంతర్పణలు జరుగుతాయి. నేను తత్వవేత్తగా ఎదగాలనుకోవడంలో పెదనాన్న ప్రభావం ఉంది. మేనమామ ప్రభావం కూడా కొంత లేకపోలేదు.

నడిపినాన్న మిట్టపెల్లి లక్ష్మిరాజం. చాలా కాలం బట్టలు నేసి బతికాడు. ఆయనకు యిద్దరు మగపిల్లలు, యిద్దరు ఆడపిల్లలు. పెద్దకూతురు ముప్పయి యేళ్ల క్రితం ఒక గౌడును కులాంతర వివాహం చేసికొంది. ఆ కారణాన పెద్దక్కతో సంబంధాలు తగ్గించారు. మా పెద్దక్క పిల్లల పెళ్ళిళ్ళన్ని గౌడకులంలో జరిగాయి. పెళ్ళిళ్ళు తిరిగి రెండు కులాల మధ్య ఎందుకు జరగలేకపోయాయో - ఆ బాధ యిప్పటికీ వెన్నాడుతూ ఉంది.

మేం ముగ్గురు అన్నదమ్ములం. 1955లో నా ఆరోఏట నాన్న చనిపోయాడు. అప్పటికి తమ్ముడు గోపాల్ తల్లిపాలు మానలేదు. నాన్న చనిపోయిన ఆరోగ్య కారణాలు చాలా చిన్నవి. పేదరికం, అజ్ఞానం వల్ల నాన్న పోయాడు. నాన్నకు డీసెంట్రీ (బంకబైలు) పట్టుకొని తగ్గకపోగా బీజకుట్టు అని పిలిచే హెర్నియా నొప్పి తోడై సరైన వైద్యం దొరక్క చనిపోయాడు.

చనిపోయేనాటికి నాన్న బొంబాయి బట్టల మిల్లు కార్మికుడు. ఏడాదికి ఒకటి రెండుసార్లు యింటికి వచ్చేవాడు. కొద్ది రోజులు నాన్నతోపాటు అమ్మ బొంబాయి వెళ్ళి కాపురం పెట్టింది. పొట్ట గడవక వచ్చేసింది.

పద్మశాలీలు 1949లో జగిత్యాల్లో "చేనేత సహకార సంఘం" స్థాపించారు. దాని నిర్మాణంలో నాన్న కూడా పాల్గొన్నాడు. ఈ సంఘాన్ని గుడికన్న, బడికన్న పవిత్రంగా ఎంచారు. ఎందరో మహనీయులు చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కృషి చేశారు. ఈ సంఘం యితర కులాల సహకార సంఘాల నిర్మాణానికి ఉత్తేజాన్నిచ్చింది. నాన్న యిలా ఒక సామాజిక పరిణామక్రమం తాలూకు సమాజ పునర్ నిర్మాణ చరిత్రలో భాగస్వామి.

నాన్న కూడుపెట్టని కులవృత్తులు వదిలి పారిశ్రామిక వృత్తులు చేపడ్తూ "రెక్కల కష్టం" పై ఆధారపడే కార్మిక వర్గంగా రూపుదిద్దుకుంటున్న తరానికి ప్రతీక. బట్టల మిల్లు కార్మికుడుగా మారక ముందు నాన్న యింటి వద్దే బట్టలు నేస్తుండేవాడు. నూలుకు రంగులు అద్దేపని కూడా చేసేవాడు. మా యింట్లో బట్టలు నేయడం మానేసి నలభై ఏళ్ళయిపోయింది. ఇంట్లో యిప్పటికీ ఆనాటి "యిసిరెలు"(పనిముట్లు) కొన్ని గత చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలిపోయాయి.

నాన్న పోయాక నాన్న వస్తువుల్ని అమ్మ ఎంతో జాగ్రత్త చేసింది. నాన్న వేసికొనే "కాటన్ కోట్"లను అటకమీద పెద్ద పెట్టెలో దాచింది. పెద్ద పెరిగాక మేం వేసుకుంటే చూడాలని అమ్మ కోరిక. జ్ఞాపకాలను కథలుగా మార్చి అమ్మ నాన్నను మా మనస్సుల్లో నిలిపేది. తల్లి పోయి తండ్రి మిగిలితే యిలాగే చేస్తారా - అనుమానమే.

నేను అనుకోవడం-అమ్మ ఒక గొప్ప కథకురాలు. మమ్మల్ని ఆకలి మరిపించడానికి, మురిపించడానికి ఎన్ని వందల కథలు చెప్పిందో, ఆకలితో ఊ కొడ్తూనే నిద్రపోయేవాళ్లం. నాకు ఊకొట్టడం బాగా అలవాటైంది. కథ పూర్తయ్యాక కూడా ఊకొట్టేవాన్ని. ఇంకా చెప్పుమని హఠం చేసేవాన్ని. ఇపుడు పత్రికల్లో, టీవిల్లో సీరియల్స్ పొడిగించినట్టు ఊకొట్టిన కొద్దీ కథను పొడిగిస్తుండేది అమ్మ. అమ్మకు విసుగొచ్చినపుడు "కథకు కాళ్ళు లేవు-ముంతకు చెవుల్లేవు" అంటూ ముగించేది. ముగింపులేని కథల్ని వినడం అమ్మతోనే మొదలు. జీవితం కూడా నిరంతరం నడిచే ముగింపులేని కథే.

కథల్లో కథలాగా నాన్న గురించి చెప్పేది అమ్మ. నాన్న గుణగణాల్ని ఆదర్శీకరించి వర్ణించేది. 'అబద్ధాలు తియ్యి' అని తాత కొన్ని తీసిపారేసేవాడు. వాటిని అబద్ధాలు అనకూడదేమో అవి మన వ్యక్తిత్వాల్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు "అమ్మ రచించే పాఠ్యాంశాలు" అనాలేమో.

వ్యక్తిత్వ రూపశిల్పిగదా అమ్మ. నాన్న ఎలా ఉండేవాడో కన్నా నాన్న అనేవాడు ఎలా ఉండాలో - అలా ఉండే వాడన్నట్టు చిత్రించింది. నాలో ఉన్న నాన్న చిత్రం వేరు. ఓసారి బజ్జీ కొనిమ్మని ప్రేమగా అడిగితే ముద్దుగా దగ్గరికి పిలిచి "ల్యాకబద్ద"(బట్టలు నేయడంలో వాడే నునుపైన వెదురుబద్ద)తో నాలుగైదు అంటించాడు. ఆ దృశ్యం చెదిరిపోయినా ఫీలింగ్ మిగిలిపోయింది. నాన్నను నేను క్షమించలేకపోయాను.

నాన్నపై కోపం నిలిచిపోవడానికి యింకో కారణం ఉంది. నాన్న పోయాక ఈ కారణం మొదలైంది. నాన్నకు మాతో అమ్మ ఏటా తిథి పెట్టించేది. కోడిని కోసి పూరీలు, చక్కని "వరి

అన్నం" విస్తట్లో 'వడ్డించి కల్లు ఆరగించి దండం పెట్టి తినడమే మేం పెట్టే తిథి. తిథిని చిన్నోడు చింతల్లో పెట్టినా, పెద్దోడు పెరట్లో పెట్టినా మెచ్చుతాడు-నడిపోడు నడియింట్లో పెట్టి మొక్కినా మెచ్చడు అని అమ్మ నన్ను కోపంగా అంటుండేది.

"చచ్చిపోయాకైనా ప్రేమించని నాన్నకు నేనెందుకు మొక్కాలి. ఎందుకు గౌరవించాలి" ఈ ఆత్మాభిమానం అప్పటి నుండి నా వ్యక్తిత్వంలో రూపుదిద్దుకున్నది. మనల్ని ప్రేమించనివారిని గౌరవించ నిరాకరించడం ఒక పెద్ద పోరాటం. నాన్న తరఫున వాదించి అమ్మ ఓడిపోయింది. నేను మొక్కను అన్నాక అమ్మ ఓడిపోయి బతిమాలక ఏం చేస్తుంది. ఆ పోరాటంలో అమ్మ గెలిచి ఉంటే చెహోవ్ కథలోని "గుమాస్తా మనస్తత్వం" నాకు అబ్బి ఉండేది.

అమ్మకు కొన్ని విషయాలు తెలియవు అని తెల్సుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రపంచంలో అందరికన్నా గొప్ప-అన్నిటికన్నా గొప్ప అయిన అమ్మకు కొన్ని తెలియవు. అవి తెలియని అమ్మ అంత గొప్పదైనపుడు-అవి తెల్సిన నేను అమ్మకన్నా గొప్ప. చదువువల్ల అమ్మను గెలవచ్చు. అమ్మను గెలిస్తే ప్రపంచాన్ని గెలిచిన తృప్తి.

నాకు అమ్మకు తెలియని సంగతులు చదువులో తెల్సినకొద్దీ "నీకేం తెల్వదిపోయే" అని గారాబంతో విసుక్కునేవాన్ని. ఇది నాకు ఊతపదం అయింది. అమ్మ ఓసారి నవ్వేది. ఓసారి రోషం ఫీలయ్యేది. ఓసారి కొట్టేది. ఓసారి నిజమే సుమీ అని నన్ను చూసి గర్వంగా ఫీలయ్యేది. ఒకే ఊతపదం అమ్మలో యిన్నిరకాల భావాలు కలిగించడం భలే ఆసక్తిగా ఉండేది.

"నీకేం తెల్వది పోయే" అనేమాట చాలా దూరం పోయింది. నేను ఎదగడంలో యిదొక మూలసూత్రం. నేను విప్లవాన్ని అమ్మలా ప్రేమించాను. అందువల్లే అమ్మను, భార్య, నలుగురు పిల్లలను, పదేళ్ళ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి విప్లవంలో చేరాను. నేను వెళ్ళి పోయినందుకు అమ్మ కొంతకాలం పిచ్చిదైపోయింది. కొద్దికాలం హైద్రాబాద్ ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో ఉంచారు.

కానైతే నేను అమ్మలా నమ్ముకున్న విప్లవ నాయకత్వం నన్ను సైతం పిచ్చివాన్నిగా మార్చే ప్రయత్నం చేసింది. వేరే కారణం ఏమీ లేదు "నీకు ఏం తెల్వదు పోయే" అనే ఊతపదాన్ని విప్లవ నాయకుల్తోనూ అన్నాను. కాని ఆ నాయకులు అమ్మలు కాదని తెలియని విషయాల్లో అమ్మలా ఓడిపోవడానికి సిద్ధంగా లేరని నాకేం తెల్సు! "నీకేం తెల్వదు పోయే" అన్నందుకు వారు పెట్టిన మానసిక చిత్రహింసలకు **3, 4** సార్లు ఆత్మహత్య చేసికోవాలనుకున్నాను. అందర్నీ వదిలి యిక్కడికి వచ్చాక యిక ఎక్కడికి పోను అని ఎన్నిసార్లు ఏడ్చేసానో.

ఇలా అమ్మ దగ్గర ప్రాక్టీసు చేసిన "నీకేం తెల్వదిపోయే" అనే అలవాటు నా జీవితమంతటా విస్తరించింది. "ప్రతిదీ ప్రశ్నించు" అన్న బుద్ధుని తత్వానికి ఒక వాదరూపమే-"నీకేం తెల్వది పోయే". తర్కశాస్త్ర, తత్వశాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారికి దీని లోతేమిటో స్పష్టం. పేదింటి దళితులు తమ పిల్లలు యిలా అంటే లోలోన గర్వపడవచ్చు. అదే మధ్యతరగతి అహంకృతులైతే "నీకేం తెల్వదిపోయే" అంటే నన్నే ఎదిరించి ఎంతమాటన్నావూ-అని ఈడ్చి తన్నవచ్చు.

నేను గెలిచేందుకు అమ్మ ఓడిపోయే ఆటలు ఆడింది. "పచ్చీసు" ఆట తానే నేర్పింది. వంటలు వండడం, అలుకు చల్లి ముగ్గులేయడం అలానే నేర్పింది. అమ్మంటే ప్రేమతో పనులపై కూడా శ్రద్ధా, ప్రేమా, గౌరవం కలిగాయి. అమ్మ జీవితాన్ని ఓడిపోయి మా జీవితాన్ని గెలిపించింది. నా గెలుపులో తన గెలుపు రూపాన్ని చూసుకుంది అమ్మ.

అమ్మ తన యిరవై అయిదో ఏట భర్తను కోల్పోయింది. మమ్మల్ని కన్న ఖర్మానికి అమ్మ జీవితాన్ని బలికోరాము. నాన్నతో అమ్మ కల్సి గడిపిన కాలం కొద్ది. బొంబాయి వెళ్ళాక ఏ ఆరు నెలలకో వారం పదిరోజులు యింటికి వచ్చి వెళ్ళేవాడు. అమ్మనాన్నతో కాపురం చేసింది తొమ్మిదేళ్ళే.

పర్యవసానంగా నలభయి ఏళ్ళు ఆ జ్ఞాపకాల్తో సహజీవనం చేస్తూ, ఒంటరిగా జీవించింది.

తొంభై రెండులో సంక్రాంతి రోజున అమ్మ తన అరవై మూడో ఏట చనిపోయింది. పిల్లల భవిష్యత్తు కోసం అమ్మ జీవితమంతా వేదనే మిగిలింది. వేదనతోనే పోయింది. తాను చేసిన త్యాగాన్ని కొడుకులు, కోడళ్ళు గుర్తించి గౌరవించడంలేదని అమ్మ తీరని వ్యధకు లోనైంది. అమ్మ ఎంతో ప్రేమను పంచింది. అయినా సమాజం మమ్మల్ని తండ్రిలేని పిల్లలుగా "ముండబొడ్డి" సాదే పిల్లలుగా చూసింది. మేనమామ తన పిల్లల్ని పెంచిన తీరుచూసి తండ్రి అనవసరం అనిపించిన క్షణాలు లేకపోలేదు. తండ్రి లేని లోటు మాకు సంబంధించింది కాదు. అమ్మే అన్నీ చూసేది. కాని సమాజం అమ్మనూ, మమ్మల్నీ హీనంగా చూసేది. అందుకని నాన్న గురించి అపుడపుడు బాధపడేవాళ్ళం.

మాకు పొలాలు గట్రా లేవు. ఉన్నది ఒకటే పెంకుటిల్లు. మట్టియిల్లు, అమ్మ జీవితమంతా యిందులోనే గడిచింది. నా జీవితమూ యిందులోనే గడిచింది. నాకు ఉద్యోగం దొరికాక డెబ్బయి ఏడులో ఈ యింటికి సిమెంటు పూతలు చేయించి, షాబాతురాళ్ళు(నాపరాళ్ళు) పరిపించి, కరెంటు పెట్టించుకున్నాం, మూడుగదుల యిల్లది. యాభయి ఏళ్ల కుటుంబ చరిత్రకు యీ యిల్లు ఒక సాక్షి.

నాన్నపోయాక అమ్మను మారుమనువు (మారుపెళ్ళి) అడిగారు. మాకు అమ్మ కావాలి. ఎన్నో రాత్రులు ఏడ్చి ఏడ్చి ఆకలితో నిద్రపోయాం. అమ్మ మళ్ళీ పిల్లలు కనడానికే మారు మనువు అని అర్థమైంది. మారు మనువుపోతే క్రమంగా యిల్లు కాజేయవచ్చుననుకున్నాడు మేనమామ. తాత అమ్మమీది ప్రేమతో మారుమనువు సంబంధాలు వెతికాడు. అమ్మకు మళ్ళీ పెళ్ళి చేసికోవాలనే ఉండింది. అయితే "కన్యాశుల్కం"లోని బుచ్చమ్మలా మౌనంగా ఉండిపోయింది.

అమ్మ మళ్ళీ పెళ్ళి చేసికొంటే మా భవిష్యత్తు ఏమిటనే భయం వెన్నాడింది. తాత యింట్లో ఉంటే మేనమామ చదువు మాన్పించి మగ్గం పనికి తోలుతాడు. అమ్మతో రెండో నాన్న వెంట వెళ్తే కూలిపని చేయిస్తాడు. అమ్మ ఆసరాలేని ప్రపంచం చిమ్మచీకటి. నాన్న చనిపోయినపుడు ఏడుపు రాలేదు. నాన్న దేవుని దగ్గరికి పోయిండు అని "పాడె" మీదున్న నాన్న కాళ్ళకు దండం పెట్టుమన్నపుడు, అపుడు నాన్న కాళ్ళు పట్టుకున్నప్పుడు-ఏడ్చాను. మిగతా ఏడ్పు అమ్మ ఏడుస్తుంటే చూసి ఏడ్చిందే. కాని అమ్మపై హక్కుకోసం రోజుల తరబడి ఏడుస్తూ బెంగతో చిక్కి శల్యమైనాం.

అమ్మ మా కోరికకే చివరకు ఓటేసింది. మారుమనువు సంబంధాలన్నీ తిప్పి పంపింది. నాన్నను తలుచుకుంటూ మమ్మల్ని అక్కున చేర్చుకుని ఏడ్చింది. అప్పటినుండి అమ్మ జీవితమంతా ఏడుపే. రష్యా నవల "తల్లీ భూదేవి" చదివాక రెండో నాన్న అలా ఉండాలని పించింది. మారుమనువుకు వచ్చిన ప్రతి మగాడూ అమ్మను అంగట్లోని పశువులా శరీరాన్ని అసహ్యంగా పరికించి చూసారేగానీ మమ్మల్ని ప్రేమగా ముద్దాడినవారు లేరు.

భవిష్యత్తు జీవితం ఏమిటో తేలిపోయాక అమ్మ వ్యవసాయ పనులకు కూలికి వెళ్ళేది. బట్టలు నేసే మగ్గం సామగ్రి అంతా యింట్లో ఉంది. అయితే ఆ పని కుటుంబం అంతా కల్సి చేస్తేకాని సాగని పని. నాన్నలేడు. అన్నను చదివించాలని అమ్మ తపన. నేతపని ఎంతైనా నీడపట్టున యింట్లో చేసికొనేపని. వ్యవసాయపు పని ఊరుదాటి రెండు కిలోమీటర్లు దాటి నడిచివెళ్ళాలి. పదిమందితో పాటు పని. పదిమందిలోంచి నడవాలి. పదిమంది నీచపు చూపుల్లో పడాలి. కూలి ఏపూట దొరుకుతుందో ఏపూట దొరకదో తెలియదు. పని చేయించుకునే రైతులు పనిచెయ్యమని ఎద్దును పొడిచినట్టు-సూటిపోటి మాటలు-బూతు తిట్లు. అమ్మకు యివేవీ యిష్టం ఉండేది కాదు. పుట్టిన్నించి తల్లిగారిల్లు, అత్తగారిల్లు అంతా తన యింట్లోనే. ఎంతో అభిమానవతి అమ్మ.

అమ్మ బొంబాయిలో ఉన్నప్పుడు బీడీలు నేర్చుకుంది. కోరుట్లలో కొన్ని బీడీ కంపెనీలు

వెలిశాయి. అప్పట్లో జగిత్యాల్లో వాటి బ్రాంచీలు లేవు. పొలాల మీద కూలీ పనులు మానేసి అమ్మ మమ్మల్ని తీసుకుని కోరుట్ల చేరి బీడీ కార్మికురాలుగా మారింది. పొరుగూర్లో బతుకు కష్టం అయిపోయింది. జగిత్యాల్లోనే ఒక బీడీ కంపెనీ బ్రాంచి వేయాలని కోరింది. అమ్మలాంటి వాళ్ళు నలుగురైదుగురు కలిశారు. కంపెనీ యజమానుల్తో పోరాడి జగిత్యాల్లో బ్రాంచీ వేయించుకున్నారు. అప్పటినుండి చనిపోయే ముందు కొన్నేళ్ళక్రితం దాకా అమ్మ నిరంతరం బీడీలు చేస్తూనే ఉండింది. అలా నేను బీడీ కార్మికురాలి బిడ్డను.

అమ్మవద్ద ఎందరో బీడీల పని నేర్చుకున్నారు. ఈరోజు బీడీ పరిశ్రమ ప్రతిపల్లెలో స్త్రీలకు ఒక ప్రధాన వృత్తి - ఆదాయవనరు. ఇది ఏ విప్లవం కన్నా తక్కువ కాదు. అమ్మ అందులో ఒక ప్రధాన పాత్ర. అయితే కమ్యూనిస్టు కార్మిక ఉద్యమ చరిత్ర అమ్మలాంటి వాళ్ళ చరిత్రను ఒక విప్లవ బతుకుపోరాటంగా రాసే స్థాయికి ఎదగలేదు.

పోరాటం ఎక్కడో లేదు. బతుకులోనే పోరాటం ఉంది. మన బతుకే ఒక పోరాటం. ఒక స్థాయి బతుకు బతకడమే ఒక పోరాటంగా సాధించుకోవాల్సిన జీవితాలు మనవి. అందువల్ల మన జీవిత యదార్థ చిత్రణే ఒక గొప్ప సామాజిక విప్లవ నవల, కథ అవచ్చు.

అపుడపుడు అమ్మకు "దేవుడు" వచ్చేది. అయితే కాలజ్ఞానం చెప్పే "ఆకులు" రాలేదన్నారు. అందువల్ల తూలినా గతం, వర్తమానం, భవిష్యత్తు చెప్పలేకపోయేది. ఆ శక్తి రావడం కోసం అమ్మ ఎందరినో ఆశ్రయించింది. భర్త లేని స్త్రీ అని అలుసు తీసుకున్నారు. లైంగికంగా లొంగదీసుకునే ప్రయత్నాలు చేశారు. అమ్మ అసహ్యించుకుంది. వారి చుట్టు తిరగడం మానేసింది. వృద్ధాప్యం పైబడినకొద్దీ "దేవుడు"గా కన్పించిన హిస్టీరియా దానంతటదే తగ్గిపోయింది.

భర్తలేని స్త్రీగా అమ్మ ఎన్ని 'అవమానాల పాలైందో - అవన్నీ హృదయంలోనే దాచుకుంది. ఎవరికీ చెప్పేది కాదు. చెప్పి పరువు కించపరుచుకోవడం ఎందుకు అని లోలోనే కుమిలిపోయేది.

నేను అమ్మ చాటు పిల్లడిగా పెరిగాను. అమ్మవెంట అమ్మలక్కల మధ్య పెరిగాను. మగ ప్రపంచం నా మొదటి ప్రపంచం కాదు. స్త్రీల సమాజంలో పెరిగాను. అమ్మ జీవితాన్ని ఎరువుగా తీసుకుని ఎదిగిన మొక్కను నేను. అమ్మ చేసే త్యాగం ఆమె కని, పెంచిన పిల్లలకైనా అర్థం అవుతుందా!

జ్ఞాపకాలు వాస్తవ జీవితం కాదంటారు. చరిత్రంతా జ్ఞాపకాల తాలూకు వాస్తవాలే కదా. జ్ఞాపకాలు వాస్తవాలు కాకపోయినా వాస్తవంగా తిరిగి రూపుదిద్దుకునే అవకాశం ఉంటుంది. కాకపోతే అమ్మ నలభయి ఏళ్ళు జ్ఞాపకాల్ని వాస్తవ జీవితం చేసికొని వాటితో సహవాసం చేస్తూ బతకడం ఎలా సాధ్యపడింది.

ఏమైనా-అమ్మ జీవితపాఠం, చిన్న వయసులో భర్తను కోల్పోయిన ఏ తల్లీ మళ్ళీ పెళ్ళి లేకుండా జీవితం వెళ్ళమార్చకూడదని అర్థం చేయించింది. నలభయి ఏళ్ళు అమ్మ భరించిన ఒంటరితనం, మోసిన కష్టాలు, అవమానాలు అమ్మసొలు(వారసత్వం గల) పిల్లడిగా చూశాక నాకీ అభిప్రాయమే నిలిచిపోయింది. అమ్మలాంటివాళ్ళు జీవితంలో మళ్లీ పెళ్ళి చేసుకోవాలని ఇప్పటి నా ప్రగాఢ విశ్వాసం. తెల్సీ తెలియని వయస్సులోని ఆ తల్లీ పిల్లలకు కావాల్సింది నైతిక మద్దతు, భద్రత యిచ్చే హృదయం-ఆదరించే యిరుగూ పొరుగూ.

*(రచనాకాలం - 1993)*
*డిశంబరు 95 - మార్చి 96*
*స్త్రీవాద పత్రిక భూమిక.*